## బీటెక్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

- సూర్యపేట జిల్లా చిలుకూరు గేట్ ఇంజినీరింగ్ కాలేజీలో ఘటన



కృష్ణవేణి (ఫైల్)

జైపూర్, ఏప్రిల్ 19 : పెగడపల్లి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని గంగాధరి కృష్ణవేణి (21) సూర్యపేట జిల్లా చిలుకూరు గేట్ ఇంజినీరింగ్ కళాశాల బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం తెల్లవారు జామున ఘటన జరుగగా గ్రామంలో విషాదం నెలకొంది. పెగడపల్లి మాజీ సర్పంచ్ గంగాధరి లక్ష్మి-లింగయ్య కూతురు కృష్ణవేణి గేట్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నది. ఉగాది పండుగకు పెగడపల్లికి వచ్చి, 18న తల్లితో కలిసి కాలేజికి వెల్లింది. రాత్రి తల్లితోనే నిద్రించిన కృష్ణవేణి, కాలేజీ భవనంపై నుంచి దూకింది. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. కళాశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా, అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఒకరిపై కేసు నమోదు

హాజీపూర్, ఏప్రిల్ 19 : హాజీపూర్ మండలం బుద్ధిపల్లి పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనం చెట్లు నరికిన ముడిమడుగుల లింగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపారు. పల్లె ప్రకృతి వనంలోకి అక్రమంగా చొరబడి టేకు, వేప, రైన్‌ట్రీ చెట్లను నరికి వేశాడు. కాగా, జీపీకి సుమారు రూ.15వేల నష్టం జరిగిందని, అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిలోనికి చొరబడి ప్రభుత్వ ఆస్తి నష్టం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శి బండం రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ముగ్గురి రిమాండ్

దహెగాం, ఏప్రిల్ 19 : దహెగాం మండలం కోత్మీర్ గ్రామానికి చెందిన బొలిశెట్టి వెంకటేశ్, అతడి తల్లిదండ్రులు భాగ్య, మొండిని శనివారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ కందూరి రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్‌కు 14 ఏండ్ల క్రితం కాగజ్‌నగర్ మండలం రాస్పల్లికి చెందిన జ్యోతితో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కొడుకులు. నాలుగేళ్ల క్రితం తండ్రి వారసత్వ సింగరేణి ఉద్యోగం వెంకటేష్‌కు వచ్చింది. అప్పటి నుంచి అదనపు కట్నం జ్యోతిని వెంకటేశ్‌తో పాటు మొండి, భాగ్య వేధించేవారు. ఈ నెల 16న కూడా వేదించడంతో పాటు, బలవంతంగా పురుగుల మందు తాగించారు. జ్యోతి తల్లి పెరక సుశీల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి, పూర్తిస్థాయి విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## మీ సేవ కేంద్రం సీజ్

తాండూర్, ఏప్రిల్ 19 : తాండూర్‌లోని శ్రీ వేంకటేశ్వర మీ సేవ కేంద్రాన్ని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. నిబంధనలు అతిక్రమించి వినియోగదారుల నుంచి అధిక ఫీజు వసూలుతో పాటు, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు అధికారులు శనివారం విచారణ జరిపారు. మీ సేవ కేంద్రాన్ని సీజ్ చేయడంతో పాటు, నివేదికను కలెక్టర్‌కు పంపిస్తున్నట్లు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు.

## బియ్యం తరలిస్తున్న వాహనం పట్టివేత

వాంకిడి, ఏప్రిల్ 19 : మహారాష్ట్రకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న బొలెరో వాహనాన్ని శనివారం ఉదయం పట్టుకున్నట్లు వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. కాగజ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ముజసిం, ఎండీ తాజ్.. కాగజ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేసి, బులెరో వాహనంలో మహారాష్ట్రకు తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు మండల కేంద్రంలోని లంజన్ వీరా ఎక్స్‌రోడ్డు సమీపంలో వాహనాన్ని పట్టుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకొని, ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


## పోలీసుల తనిఖీ

కన్నెపల్లి, ఏప్రిల్ 19 : మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో నకిలీ విత్తనాలు ఉన్నాయనే సమాచారం మేరకు శనివారం పోలీసులు పలువురు అనుమానితుల ఇండ్లలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు వాడడం వల్ల భూమి సారవంతం కోల్పోయి, దిగుబడి తగ్గుతుందన్నారు. గ్లైఫోసెట్ నకిలీ విత్తనాలు వాడడం వల్ల రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశమూ ఉంటుందని తెలిపారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు ఉన్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## 21న ప్రజావాణి రద్దు

నస్పూర్, ఏప్రిల్ 19 : భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టం అవగాహన సదస్సులు జిల్లాలో జరుగుతున్నందున 21న జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

## గురుకులానికి విద్యార్థిని ఎంపిక



ఎంపికైన విద్యార్థినితో ఉపాధ్యాయులు

తాండూర్, ఏప్రిల్ 19 : మండలంలోని బారెపల్లి ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థిని ఆదె వైష్ణవి గురుకులానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం మాసాడి శ్రీరాములు తెలిపారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 5,6వ తరగతి గురుకుల సీట్ల ఎంపిక కోసం పరీక్ష నిర్వహించి, ఫలితాలు విడుదల చేసింది. కాగా, వైష్ణవి భద్రాచలం పాల్వంచ గురుకుల పాఠశాలలో 5వ తరగతికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని హెచ్‌ఎంతో పాటు, ఉపాధ్యాయులు ఎన్ సతీశ్‌కుమార్, మురళీధర్‌గౌడ్, తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

## విద్యార్థినులకు అవగాహన

సిర్పూర్ (యూ), ఏప్రిల్ 19 : సిర్పూర్ (యూ) కేజీబీవీలో శనివారం విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశంపై ఐసీఏ మోటివేషనల్ స్పీకర్ చెంచు లక్ష్మి అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులు జరిగే అవకాశం ఉన్నట్లు గమనిస్తే షీ టీం సభ్యులకు గానీ, డయల్ 100కు గానీ కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది. జయశ్రీ, సౌందర్య సిబ్బంది, విద్యార్థులున్నారు.

## గ్రూప్ 1 పరీక్ష రద్దు చేయాలి

నస్పూర్, ఏప్రిల్ 19 : గ్రూప్ 1 పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగుల జీవితాలు అగాధంలోకి వెళ్లాయని పేర్కొన్నారు. ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసిన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో మంచి మార్కులు సాధించడం వంటివి అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయని తెలిపారు.



జైపూర్‌లో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కౌటాల : వీరవెల్లిలో..

# రజతోత్సవ సభ విజయవంతం చేయాలి



మందమర్రి : వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మందమర్రి, ఏప్రిల్ 19 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో 27న బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన రజతోత్సవ సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్ పిలుపునిచ్చారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 15, 16వ వార్డులు శ్రీపతి నగర్, దీపక్ నగర్ కాలనీల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి వాల్ పోస్టర్లను విడుదల చేయడంతో పాటు, పలు కాలనీల్లో అంటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైన నేపథ్యంలో ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ సభ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలను ఆహ్వానించారు. సభకు తరలివెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తప్పకుండా సభకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, రామసాని శేఖర్, మంతెన సుమన్, అనప మల్లేశ్, బెజ్జాల సాయి, సకినాల రాజు, విరుగురాల వినయ్, సుధీర్, బండి రాజు, ఓ రాజశేఖర్, బడికెల సంపత్, బండారు సూరిబాబు, మద్ది శంకర్, ఎండీ అబ్బాస్, బర్ల సదానందం, మేడిపల్లి మల్లేశ్, తోట సురేందర్, కోరబోయిన లక్ష్మణ్, కుడాల తిరుపతి, పూసాల ఓదెలు, మొగురం శ్రీనివాస్, సాగర్, ఎండీ ముస్తఫా, అందె శ్రీకాంత్, ముల్కల రమేశ్, ఎండీ మజార్, శనిగరపు అరుణ్, సీపెల్లి సాగర్ పాల్గొన్నారు.

### చరిత్రలో నిలిచిపోనున్న ఎల్కతుర్తి సభ

జైపూర్, ఏప్రిల్ 19 : బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆదేశాల మేరకు జైపూర్ మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి బహిరంగసభ వాల్‌పోస్టర్‌ను డాక్టర్ రాజా రమేశ్ ఆవిష్కరించారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న బహిరంగసభ చరిత్రలో నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బల్మూరి అరవిందరావు, సీనియర్ నాయకులు రిక్కుల మధూకర్‌రెడ్డి, మేడి తిరుపతి, ఆర్నె సమ్మయ్య, బడుగు రవి, జగన్‌గౌడ్, పూదరి మల్లేశ్, సోషల్ మీడియా నాయకులు దూట రాజశేఖర్, చిప్పకుర్తి సురేశ్, కొరివి శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, ఏప్రిల్ 19 : కౌటాల మండలం వీరవెల్లిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను పార్టీ మండలాధ్యక్షుడు నాగపురే బండు పటేల్ విడుదల చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, నేడు అదే తెలంగాణ అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గ మెంబర్ దుర్గం వెంకటేశ్, చారి గోవింద్ రావు, దుర్గం సందీప్, నవీణ్, గోపాల్, దిలీప్, నాందేవ్, మోరేశ్వర్, రాంకుమార్, సచిన్, పవన్ పాల్గొన్నారు.

## పుట్టినరోజే చివరి రోజు

- గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడు మృతి



పూరెళ్ల అశోక్ (ఫైల్)

కోటపల్లి, ఏప్రిల్ 19 : పుట్టినరోజే ఆ యువకుడికి చివరి రోజయ్యింది. స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఆనందోత్సహాల మధ్య గడపాల్సిన యువకుడి మరణం పారుపల్లి గ్రామాన్ని విషాదంలోకి నెట్టింది. కోటపల్లి మండలం పారుపల్లి గ్రామానికి చెందిన పూరెళ్ల సావిత్రి-శంకరయ్య కొడుకు అశోక్‌ది (19) శుక్రవారం పుట్టినరోజు కాగా, ఆనందంగా గడిపాడు. తల్లిదండ్రులు కొత్త బట్టలు తీసుకురాగా, గోదావరి స్నానం చేసి ధరిస్తానని చెప్పి, శుక్రవారం సాయంత్రం పారుపల్లి సమీప గోదావరికి వెళ్లాడు. సాయంత్రం స్నేహితులు కేక్‌తో అశోక్ ఇంటికి వెళ్లి కటుంబ సభ్యులను అడిగారు. అశోక్ ఇంటికి రాకపోవడంతో కలవరపడిన కుటుంబ సభ్యులు, స్నేహితులు అశోక్‌కు ఫోన్ చేసినా ఫలితం లేకుండా పోయింది. గోదావరి వైపు వెళ్లగా ఇసుక కోసం వేసిన రోడ్డుపై బైకు ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే చీకటి పడగా శనివారం గాలింపు చర్యలు చేపట్టగా, మృతదేహం లభించింది. దీంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

### జాతీయ రహదారిపై ఆందోళన..

గోదావరిలో ఇసుక కోసం తవ్విన గుంతలోనే అశోక్ పడడంతో మృతి చెందాడని పారుపల్లి గ్రామస్తులు 63వ జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. కాంట్రాక్టర్ గోదావరిలో 20 నుంచి 30 ఫీట్ల గుంతలు తవ్వడం వల్ల భారీ గుంతలు ఏర్పడ్డాయని ఆరోపించారు. మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే కాంట్రాక్టర్లు ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు జరిపారన్నారు. ఈ గుంతల వల్ల యేటా మరణాలు సంభవిస్తున్నాయని వాపోయారు. సుమారు 4 గంటలకుపైగా జాతీయ రహదారిపైనే గ్రామస్తులు బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సంఘటనా స్థలాన్ని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ సందర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళన విరమించారు. బీజేపీ నాయకులు దుర్గం అశోక్, కాశెట్టి నాగేశ్వర్ రావ్, మంత్రి రామయ్య, పెద్దింటి పున్నంచంద్, పెద్దింటి వెంకన్న తదితర నాయకులు పరామర్శించారు.

## అనాథ పిల్లలకు ఆర్థిక సాయం

- 'నమస్తే' కథనానికి స్పందన

సిర్పూర్(యూ), ఏప్రిల్ 19 : తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన సిర్పూర్(యు) మండలం రాఘుపూర్‌కు చెందిన చిన్నారులకు హెడ్ సొసైటీ అధ్యక్షుడు జాదవ్ శ్రీకాంత్ అండగా నిలిచారు. కాగా, 'నాడు తల్లి.. నేడు తండ్రి..' అని ఈ నెల 16న 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనానికి స్పందన లభించింది. గతంలో అనారోగ్యంతో తలి సోయం లక్ష్మి కన్నుమూయగా, ఇటీవల వడదెబ్బతో తండ్రి సోయం హన్మంతు మృతి చెందాడు. దీంతో వారి పిల్లలు జంగుబాయి, చంద్రబాన్ అనాథలయ్యారు. వీరికి హెడ్ సొసైటీ అధ్యక్షుడు రూ.5 వేలు అందజేశారు. పిల్లల బాగోగులు, చదువు విషయంలో పూర్తి బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రమేశ్ పిల్లలను పరామర్శించారు. పిల్లలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి, అన్ని విధాలా ప్రభుత్వమే ఆదుకునేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాదవ్ ఉషా, తొడసం రమేశ్ నాయకులు కోవ నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం జరిగే దాకా పోరాటం

కాసిపేట, ఏప్రిల్ 19 : వేమనపల్లి మండలం మంగేనపల్లి గ్రామంలో పెత్తందారుల దౌర్జన్యాలకు ఆదివాసీ నాయిని కన్నయ్య ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని, ఆ కుటుంబానికి న్యాయం జరిగేదాకా పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి తెలిపారు. సోమగూడెంలో శనివారం ఆయన మాట్లాడారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 21, 22 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, సీపీఎం సోమాగూడెం(కే) గ్రామ శాఖ కార్యదర్శి సంకె రాజ కుమారి, దేవాపూర్ శాఖ కార్యదర్శి ఎం బ్రహ్మయ్య, నాయకులు కే రజిత, మణి పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్/నస్పూర్, ఏప్రిల్ 19 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి శనివారం రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ హాన్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులతో యాసంగి ధాన్యం కొనుగోళ్లు, సన్న బియ్యం పంపిణీ, తాగునీటి సరఫరాపైయ వీడియో కాన్ఫరెన్స్ ద్వా రా సమీక్షా సమావేశం నిర్వహించారు. కు మ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ ఎం డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిలాలలో 48 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కోసం మొత్తంగా 34 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని చౌక ధరల దుకాణాల ద్వారా అర్హత గల ప్రతి లబ్ధిదారుడికీ బియ్యం సరఫరా చేసేలా, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ, నీటి పారుదల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల నుంచి కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 209 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, 17వ తేదీ వరకు 337 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. కేంద్రాల రైతులకు తగిన సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీకళ, డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# నస్పూర్ ఎస్ఐ కేసులో ట్విస్ట్

- రూ.30 వేలు ఎస్ఐ తనకు పంపమనలేదన్న దీపక్
- బినామీని కాదని స్పష్టీకరణ
- పరిచయం లేదంటూ వెల్లడి

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 19 : క్షుద్రపూజల కేసులో సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌పై ఏసీబీ అధికారులు తనిఖీ చేసి, ఎస్ఐ నెల్కి సుగుణాకర్‌ను అరెస్ట్ చేసిన కేసులో ట్విస్ట్ నెలకొన్నది. తనపై కేసు పెట్టకుండా ఉండేందుకు ఎస్ఐ సుగుణాకర్ రూ.30 వేలు లంచం డిమాండ్ చేసి, తనను ఆయన బినామీగా ఏసీబీ అధికారులు పేర్కొనడంపై.. ఆరోపణలు ఎదుర్కొంటున్న దాస్యపు దీపక్(ప్రభంజన్ మిత్రుడు) స్పందించారు. శనివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. తన పేరును ఎస్ఐ బినామీగా ప్రస్తావించడాన్ని తీవ్రంగా ఖండించారు. తన ద్వారా ఎస్ఐ రూ.30 వేలు లంచం తీసుకున్నాడని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాను ఇప్పటివరకు సీసీసీ నస్పూర్ పోలీస్టేషన్‌కు వెళ్లలేదని, ఎస్ఐతో పరిచయం కూడా లేదని, ప్రభంజన్ కేసుకు, తనకు సంబంధంలేదని తెలిపారు. ఏసీబీ అధికారులు ఏ ఆధారాలతో ఈ కేసులో తన పేరు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. ప్రభంజన్ మిత్రుడు సాయిరెడ్డికి రూ.30వేలు ఇవ్వాలని ఆయన సోదరి తనకు ఫోన్‌పే ద్వారా డబ్బు పంపించిందన్నారు. తాను ఏటీఎంలో నగదు తీసుకొని సాయిరెడ్డికి ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ కేసులో పూర్తి విచారణ జరిపి, వారిపై చర్యలు తీసుకోవాలని ఏసీబీ అధికారులు, రామగుండం పోలీస్ కమిషనర్‌ను ఆయన కోరారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

కౌటాల, ఏప్రిల్ 19 : ప్రజలకు ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సందీప్ అన్నారు. సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి నాగరాజ్ రక్తహీనత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ అశోక్, స్వప్న, సిబ్బంది శ్రీనివాస్, బక్కయ్య, అంగన్‌వాడీ కార్యకర్త రుక్మిణి తదితరులున్నారు.

## దరఖాస్తులు పరిశీలించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 19 : రాజీవ్ యువ వికాసం పథకం కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాన్ని శనివారం ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజేశ్వర్ జ్యోషి పాల్గొన్నారు.

## పోషకాహారంతో ఎదుగుదల

వాంకిడి, ఏప్రిల్ 19 : బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పోషకాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ తౌఫీక్ అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఖేడేగాం అంగన్‌వాడీ కేంద్రాంలో శనివారం గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ ప్రవీణ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు ఇందిరా, రాజకుమారి, వీణ, రత్నమాల, ఉమ, విజయలక్ష్మి, ఏఎన్ఎం సునీత, ఆశ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

## నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలి

పెంచికల్ పేట్, ఏప్రిల్ 19 : విద్యార్థులు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి సూచించారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఇంటరాక్షన్ హాఫ్ గర్ల్స్ స్టూడెంట్స్ విత్ రోల్ మోడల్ హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి తర్వాత చేయవలసిన కోర్సులు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహ, పాఠశాల హెచ్‌ఎం విజయనిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 19 : డ్రోన్ కెమెరా ద్వారా పెట్రోలింగ్, నేషనల్ హైవేపై క్రైమ్ హాట్ స్పాట్ ఏరియాలను డ్రోన్ వీడియో ద్వారా శనివారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ వేణుచందర్ పర్యవేక్షించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని కొత్త రోడ్డు సమీపంలో డ్రోన్ కెమెరాల ద్వారా హాట్‌స్పాట్ ఏరియాలను పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పరిశీలిస్తున్నామని చెప్పారు. జాతీయ రహదారిపై పోచమ్మ గుడి వద్ద పర్యవేక్షించినట్లు తెలిపారు. ఎస్ఐ సంతోష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ప్లీనరీకి తరలిరండి

రెబ్బెన, ఏప్రిల్ 19 : సికింద్రాబాద్‌లో 21వ తేదీన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే ప్లీనరీకి తెలంగాణ ఉద్యమకారులు తరలి రావాలని ఆ ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ దుర్గం రవీందర్, ఆసిఫాబాద్ నియోజకవర్గ కన్వీనర్ అజ్మీరా బాబురావ్ పిలుపునిచ్చారు. గోలేటిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, రూ.25 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు తోట లక్ష్మణ్, బోగే ఉపేందర్ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు తొలగించాలి

కౌటాల, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలోని కుమ్రం భీం కమిటీ హాలు ఎదురుగా ఉన్న దుకాణ సముదాయాలు తొలగించాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని కుమ్రం భీం కాంప్లెక్స్ నుంచి భీం విగ్రహం వరకు ర్యాలీ తీశారు. విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు దుకాణా సముదాయాలను తొలగించాలని తీర్మానం చేసుకొని, తహసీల్ కార్యాలయం లో ఎంఆర్ఐ దిలీప్, ఎంపీడీవో ప్రసాద్, సీఐ ముత్యం రమేశ్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డైరెక్టర్ కొమురం మాంతయ్య, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తలండి లక్ష్మణ్, ఆదివాసీ కొలావార్ సంఘం నాయకులు డబ్బా బాపు, మెర్పెల్లి బ్రహ్మయ్య, కుమ్రం భీం కమిటీ అధ్యక్షుడు సిడాం అశోక్, ఆదివాసీ గిరిజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హజ్‌యాత్రికులకు వైద్య పరీక్షలు

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 19 : హజ్‌యాత్రకు వెళ్లే 40 మందికి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అనిత ఆధ్వర్యంలో బీపీ, ఇతర పరీక్షలు, వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. యాత్రకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. సురక్షితంగా వైద్య సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ముస్తఫా, స్నేహిత, అశోక్, రాము, అఖిల్ పాషా, అభినవ్, డెమో బుక్క వెంకటేశ్వర్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## సాంకేతిక విద్యతో మంచి భవిష్యత్

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 19 : విద్యార్థులు సాంకేతిక విద్యను క్రమశిక్షణతో అభ్యసిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని సీసీసీ నస్పూర్ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇండియన్ శాటిలైట్‌ను భారతదేశంలో ప్రవేశపెట్టి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కళాశాలలో శాటిలైట్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. శాటిలైట్ వినియోగంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



అంబలి పంపిణీ చేస్తున్న అధ్యక్షుడు ఉబెద్ బిన్ యాహియా

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 19 : లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు ఉబెద్ బిన్ యాహియా (తారక్) సేవలు అభినందనీయమని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలో శనివారం యాహియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. శంకర్, భీంరావ్, నాయకులు చరణ్, బస్వాన్, జమీర్, సాయి, ప్రమోద్, పురఖన్, అకిబా తదితరులున్నారు.

## కరాటే ఉచిత శిక్షణ ప్రారంభం

రెబ్బెన, ఏప్రిల్ 19 : రెబ్బెన మండల కేంద్రంలో శనివారం నుంచి వేసవి ఉచిత కరాటే శిక్షణ ప్రారంభమైనట్లు కరాటే మాస్టర్ చాపిడి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాగన్ కుంగ్ ఫూ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. నాన్‌చాక్, డబుల్ నాన్‌చాక్, జంప్, బ్యాక్ జంప్, స్టిక్ మూమెంట్, కటా విభాగం, సారింగ్ మూమెంట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు, జూన్ 12వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## డీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా రమేశ్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 19 : మంచిర్యాల జిల్లా ధర్మ సామాజ్ పార్టీ(డీఎస్పీ) అధ్యక్షుడిగా ఏదునూరి రమేశ్‌ను శనివారం నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ తెలిపారు. ఈ మేరకు రమేశ్‌కు నియామకపత్రాన్ని అందించారు. రామస్వామి, రాకేశ్, రాజు, చంద్రశేఖర్, సదానందం, ఎండీ జమీర్, రఫీ పాల్గొన్నారు.

## ప్రేమ పేరిట వేధిస్తున్నాడని హిజ్రాల ఆందోళన

మందమర్రి, ఏప్రిల్ 19 : మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని ఒకటో జోన్ కాలనీకి చెందిన అజయ్ అనే యువకుడు ప్రేమ పేరుతో చందన అనే హిజ్రాను వేధిస్తున్నాడని హిజ్రాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒకటో జోన్‌లోని అతని ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఉదయమే అజయ్ ఇంటికి చేరుకున్న హిజ్రాలు ఇంటి ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అజయ్ చందన అనే హిజ్రాను ప్రేమ పేరుతో ట్రాప్‌చేసి వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అంతేకాకుండా తనతో తీసుకున్న వీడియోలు, ఫొటోలు తన దగ్గర ఉన్నాయని, ఒక్కోదానికి రేటు కట్టి డబ్బులు ఇవ్వాలని, తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని వారు తెలిపారు. అర్ధరాత్రి తమ ఇండ్లలోకి గోడలు దూకి వస్తున్నాడని, దీంతో తమ కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు నచ్చజెప్పినా అజయ్ తన వేధింపులు మానుకోవడం లేదని మండిపడ్డారు. ఈ విషయమై పట్టణ ఎస్ఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా.. ఈ ఘటనపై తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, అజయ్‌ను అదుపులోకి తీసుకొని తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

బెల్లంపల్లి, ఏప్రిల్ 19 : పట్టణంలోని బజార్ ఏరియా జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో పోచయ్య హాజరై మాట్లాడారు. వార్షికపరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. పట్టణంలోని పలు పాఠశాలల హెచ్‌ఎంలు మహేశ్వర్‌రెడ్డి, లింగయ్య, సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ, ఉపాధ్యాయులు కోవారత్నం వెంకటేశ్వర్‌రావు, సంధ్యారాణి, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 19 : మంచిర్యాల పట్టణంలోని ఏసీసీ 33/11 కేవీ లైన్, రాజీవ్‌నగర్ 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ మంచిర్యాల టౌన్ 2 ఏఈ శ్రావణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఏసీసీ, రాజీవ్‌నగర్ సబ్ స్టేషన్ల పరిధిలోకి వచ్చే జాఫర్ నగ ర్, హైటెక్ కాలనీ, జన్మభూమినగర్, ఇందిరానగర్, ఇక్బాల్ అహ్మద్ నగర్, మార్కెట్ ఏరియా, గ్రీన్‌సిటీ, శ్రీనివాస గార్డె న్స్ ఏరియా, అండాలమ్మ కాలనీ, మారుతీ నగర్, ఒడ్డెర కాలనీ, లక్ష్మీనగర్, గౌతమీనగర్, ఇస్లాంపుర, ఎంసీసీ ఏరి యా, రాళ్లపేట, గొల్లవాడ, సావిత్రినగర్ ప్రాంతాలకు విద్యు త్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సీఎండీ కాన్ఫరెన్స్ బహిష్కరణ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 19 : సింగరేణి ఆధ్వర్యంలో ఒడిస్సాలోని నైనీ బొగ్గు బ్లాక్ ప్రారంభించుకున్న సందర్భంగా హైదరాబాద్ నుంచి అన్ని ఏరియాల జీఎంలు, గుర్తింపు, ప్రాతినిధ్య, అన్ని కార్మిక సంఘాల నాయకులను అభినందించేందుకు సీఎండీ ఏర్పాటు చేసిన వీడియోకాన్ఫరెన్ సమావేశాలను ఏఐటీయూసీ బహిష్కరించిందని డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. యాజమాన్యం కోడ్ ఆఫ్ డిసిప్లేన్ అతిక్రమిస్తున్నదని ఆరోపించారు. దాని ప్రకారం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులతో గెలిచిన ఏరియాల్లో ఆయా సంఘాల ప్రతినిధులతో అభినందనలు తెలుపుతూ సీఎండీ వీడియోకాన్ఫరెన్స్ ఏర్పాటు చేయాల్సిందన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

BRS T-SHIRTS

★ వరంగల్ దగ్గర ఎల్కతుర్తిలో జరిగే BRS సభకు మీ నాయకుడి & మీ ఫోటోతో ఉన్న T-SHIRTS మీరు కోరిన విధంగా ప్రింట్ చేసి ఇస్తాము. 7416385350.

NT-325302-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677